తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
బుధవారం
13 మే 2026
పేజీలు : 8

## పశువుల అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు

○సమన్వయంతో పని చేస్తూ సమస్యలు తలెత్తకుండా చూడాలి
○బక్రీద్ సందర్భంగా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్, సీ.పీ



**నిజామాబాద్ మే 12 జనంసాక్షి :** పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు గట్టి నిఘా కొనసాగించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. బక్రీద్ వేడుకను పురస్కరించుకుని కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జంతు సంక్షేమం, గోవధ నిషేధంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పశువుల అక్రమ రవాణా నిరోధం, జంతు సంక్షేమ నియమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్, సీ.పీ సమీక్షించారు. బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. జంతు సంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టాల ఉల్లంఘన జరగకుండా చూడాలని అన్నారు. గోవధ నిషేధ చట్టం ప్రకారం గోవులను వధించడంపై నిషేధం ఉందని, తెలంగాణాలో ఒంటెలను కూడా వధించకుండా నిషేధం అమలులో ఉందని సూచించారు. ఈ విషయాలపై ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తూ, ఎక్కడ కూడా గోవులు, ఒంటెలను వధించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువులను స్లాటర్ హౌజ్ లలోనే వధించాలని, రోడ్లపై ఎక్కడబడితే అక్కడ వధించరాదని సూచించారు. పశువులను తరలించడానికి, వాటిని వధించడానికి ముందు తప్పనిసరిగా పశు వైద్యాధికారిచే ధ్రువీకరణ పొందాలని అన్నారు. బక్రీద్ పండుగ దృష్ట్యా వెటర్నరీ వైద్యులు అన్ని చోట్ల సరిపడా సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లాలోని కందకుర్తి, సాలూర, పోతంగల్, ఖండ్ గావ్ అంతర్రాష్ట్ర చెక్ పోస్టులతో పాటు, సాటాపూర్, యంచ, ఇందల్వాయి, ఉమ్మెడ, జన్నెపల్లి, మామిడిపల్లి తదితర ప్రాంతాల వద్ద ప్రత్యేకంగా అంతర్ జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నామని సీ.పీ తెలిపారు. రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలకు చెందిన అధికారులు నిరంతరం నిఘా ఉండేలా పర్యవేక్షణ జరపాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తే వెంటనే సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువుల అక్రమ రవాణాకు సంబంధించి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలని, క్షేత్రస్థాయికి వెళ్లి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా సంయమనంతో వ్యవహరిస్తూ అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు హితవు పలికారు. సీజ్ చేసిన పశువులకు తగిన షెల్టర్ కల్పిస్తూ, వాటికి పశుగ్రాసం, నీటి వసతి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సాటాపూర్, ఇందల్వాయి తదితర చోట్ల కొనసాగే పశువుల వారాంతపు సంతలలో నిబంధనలకు అనుగుణంగా, పశు సంరక్షణ చట్టానికి లోబడి క్రయవిక్రయాలు జరిగేలా చూడాలన్నారు. వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారవేయకుండా చూడాలని, వ్యర్థాలను వెంటదివెంట జనావాసాలకు దూరంగా తరలించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులకు సూచించారు. సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో బక్రీద్ వేడుక జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ శుభం ప్రకాష్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, నిజామాబాద్, ఆర్మూర్ ఏసీపీ లు ప్రకాష్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ ట్రాన్స్ పోర్టు కమిషనర్ దుర్గా ప్రమీల, ఎంవీఐ లు శ్రీనివాస్, కిరణ్, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గంగాధరయ్య, పోలీస్, రెవెన్యూ, పశు సంవర్ధక, పంచాయతీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జయంతి ఉత్సవాల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలన

### అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

### భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి

### కలెక్టర్ సత్యప్రసాద్



**మల్యాల మే 12 (జనంసాక్షి)** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో కొనసాగుతున్న పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్,ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి సోమవారం అర్ధరాత్రి ఆలయ పరిసరాలు,క్యూ లైన్లు,మాల విరమణ ప్రాంతాలు,పార్కింగ్ స్థలాలు,తాగునీరు,పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పలు సూచనలు చేశారు. కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతున్న నేపథ్యంలో భద్రతా చర్యలు కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు,వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, ఆలయ ఈవో అంజనా రెడ్డి,ఆర్డీవో మధుసూదన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నన్ను కెలికారు.. అవినీతి గడీలను బద్దలు కొడతా

○కన్న పేగును క్షోభ పెడుతున్నారు..నా కుటుంబానికి నిప్పంటించారు.. ○ఆ నిప్పు వాళ్లనే దహించి వేయబోతోంది..
○తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు.. ○తప్పు చేసినట్లు తేలితే శిక్ష అనుభవించాల్సిందే
○కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం ○ కరీంనగర్ "హిందూ ఏక్తా యాత్ర"లో కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
○సంజయ్‌కు అండగా నిలవాలంటూ హిందువులకు హంపి పీఠాధిపతి పిలుపు

**కరీంనగర్ బ్యూరో, మే 12 (జనంసాక్షి) :** కాషాయ శ్రేణుల జోష్..హిందుత్వ వాదుల నినాదాలతో ముందుకు సాగుతున్న ఏక్తా యాత్రలో వినూత్న రీతిలో కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న హిందూ ఏక్తా యాత్ర ఘనంగా కొనసాగుతుంది. ఏ తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడని, నిజానిజాలు కోర్టులు తేలుస్తాయని, తప్పు చేసినట్లు తేలితే శిక్ష అనుభవించాల్సిందే అని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమే. కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం. చట్టానికి కట్టుబడి ఉన్నా అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. "సమాజమే నా కుటుంబమని భావించి జీవితమంతా సమాజం కోసమే పనిచేసిన. ఏ ఇంట్లో కష్టమొచ్చినా పెద్ద కొడుకునై అండగా ఉన్నా. కానీ కొడుకుకు టైమివ్వలేకపోయాను జరుగుతున్న పరిణామాలకు తప్పు నాదే. క్షమించండి అని తెలంగాణ సమాజానికి విజ్ఞప్తి చేశారు.జీవితాంతం నా బాటలోనే నడిచిన నా భార్య కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా చేతనైనంత సాయం చేసిందని, నేడు కన్న పేగునే క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా తాను



భయపడేది లేదని స్పష్టం చేసిన బండి సంజయ్ "నన్ను కెలికారు. నా కుటుంబానికి నిప్పంటించారు. ఆ నిప్పుతోనే అవినీతి, కుట్రలు చేసే వాళ్ల సామ్రాజ్యాన్ని దహించి వేస్తా. అవినీతి గడీలను బద్దలు కొడతా అని అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో మంగళవారం రోజు సాయంత్రం కరీంనగర్ లోని వైశ్యాభవన్ నుండి "హిందూ ఏక్తా యాత్ర" ప్రారంభమైంది. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి ఏక్తా యాత్రకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేలాది మంది ఈ యాత్రకు తరలి వచ్చారు. వేలాది మంది కాషాయ శ్రేణులతో మిగతా 3లో

## ఆర్మూర్ , మోర్తాడ్ లో అక్రమ ఇసుక రవాణా

○చీత ఫోర్స్ మెరుపు దాడులు ○ రెండు భారీ లారీలు పట్టివేత
○పోలీస్ కమిషనర్ వెల్లడి

**నిజామాబాద్ క్రైం మే 12 జనంసాక్షి :** మంగళవారం నాడు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు జిల్లాలో అక్రమ ఇసుక రవాణా , మైనింగ్ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది.ఇందులో భాగంగా సి.సి.ఎస్ ఏసీపీ ఇన్‌చార్జ్ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో చీత ఫోర్స్ సిబ్బంది నిత్యం ప్రత్యేక నిఘా నిర్వహిస్తూ ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు.మోర్తాడ్ పోలీస్ స్టేషన్ పరిధి మరియు ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చీత ఫోర్స్ బృందం విస్తృత తనిఖీలు నిర్వహించింది. రహస్య సమాచారం మేరకు అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇసుక లారీలను గుర్తించిన పోలీసులు వెంటనే వాటిని అడ్డుకుని తనిఖీ చేశారు.తనిఖీల్లో రెండు 14 టైర్ల భారీ వాహనాల్లో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు, రవాణా పత్రాలు లేదా మైనింగ్ సంబంధిత డాక్యుమెంట్లు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే వాహనాలను స్వాధీనం చేసుకుని, డ్రైవర్లు మరియు సంబంధిత వ్యక్తుల వివరాలను నమోదు చేశారు. పట్టుబడిన లారీలను తదుపరి చట్టపరమైన చర్యల



నిమిత్తం సంబంధిత మోర్తాడ్ మరియు ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లకు అప్పగించారు. కేసు నమోదు చేసి , ఇసుక ఎక్కడి నుండి తరలిస్తున్నారు , దీనికి సంబంధించి మరెవరు ఉన్నారు అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం వాటిల్లడమే కాకుండా , నదీ పరివాహక ప్రాంతాలు దెబ్బతిని పర్యావరణ సమతుల్యతకు మిగతా 3లో

# ఆర్టీసీ బస్సు మార్గం మళ్లింపుపై ఆగ్రహం

## రోడ్డెక్కిన గ్రామస్తులు, పంచాయతీ పాలక వర్గం



**ఇల్లంతకుంట మే 12(జనంసాక్షి )** ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్ గ్రామంలోని పెట్రోల్ బంక్ వద్ద గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామ ప్రజలు సిరిసిల్ల డిపో బస్సును ఆపి నిరసన తెలియ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గన్నేరం వసంత నర్సయ్య మాట్లాడుతూ దశాబ్ద కాలంగా సిరిసిల్ల నుండి ఇల్లంతకుంటకు వెళ్లే ఆర్టిసి బస్సు జిల్లెల్ల దాచారం పెద్ద లింగాపూర్ మీదుగా ఇల్లంతకుంటకు వెళుతుందని కానీ గత నెల 15 రోజుల నుండి గ్రామంలోకి బస్సు రావడం లేదని సిరిసిల్ల డిఎంకు ఫోన్ ద్వారా సమాచారం అడిగితే నెల 15 రోజుల నుండి ఏం చేస్తున్నారని నిద్రపోతున్నారా అని వ్యంగంగా మాట్లాడడం జరిగింది. మాకు బోటి మీది పల్లె తెలుగు వారిపల్లి సిరికొండ మీదుగా నడపాలని మాకు పైనుండి ఆదేశాలు ఇవ్వడం జరిగిందని కాబట్టి మీ ఊరి చివర నుండే బస్సు వెళ్తుందని ఈ గ్రామంలోకి ప్రత్యేక బస్సు రావాలంటే మళ్ళీ సర్వే చేయాలని దానికోసం సమయం పడుతుందని ఇప్పుడే బస్సు కావాలని అడుగుతే ఎలా అని మా దృష్టికి తీసుకువచ్చిన వెంటనే మేము మళ్ళీ సర్వే చేసి మీ గ్రామం ద్వారా బస్సు నడిపిస్తామని నిర్లక్ష్యం సమాధానం చెప్పడం విడ్డూరంగా ఉంది. ఎందుకంటే దశబ్ద కాలంగా వెళ్లే రూట్లో బస్సు నడపకుండా ఎందుకు రద్దు చేశారు అని అడిగితే స్పందించకుండా ఫోన్ కట్ చేయడం జరిగిందని గత వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుందని గ్రామంలోనికి బస్సు రాకపోవడం వల్ల సుమారు రెండు కిలోమీటర్ల వరకు నడవడానికి వృద్ధులు చిన్న పిల్లలు ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారని అందుకు నిరసనగా ఈరోజు బస్సు ఆపి నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిరిసిల్ల డిపోకు చెందిన వర్జీలాల్ సిరిసిల్ల ట్రాఫిక్ రూట్ ఇంచార్జి స్పందించి పెద్ద లింగాపూర్ వచ్చి గతంలో ఏ ప్రకారంగా అయితే బస్సు వెళ్ళిందో ఆ ప్రకారంగానే నడిపిస్తామని రద్దు అయిన బస్సును మళ్ళీ పునరుద్దిస్తామని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్లవేణి రమేష్ వార్డు సభ్యులు ఎద్దు విజయ,లింగంపల్లి అనిల్, కుమార్,గుర్రాల అనిల్ రెడ్డి గోడిసెల రజనీకాంత్,జనగాం శ్రీనివాస్ కరికె నవీన్ కుమార్, దర్శనం మరియా ప్రదీప్, నాయకులు బోప్ప శ్రీనివాస్, పసుల బాలరాజ్,పసుల రాజు గాదే మధు, తూముల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లంతకుంట మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పుష్పలత




**ఇల్లంతకుంట మే 12(జనంసాక్షి )** ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా తీగల పుష్పలతను రాష్ట్ర అధ్యక్షురాలైన ఎర్రబెల్లి స్వర్ణ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత నియామక పత్రాన్ని అందజేశారు . గతంలో అనంతారం మాజీ ఎంపీటీసీగా పుష్పలత సేవలశీదించారు. పార్టీ బలోపేతం కోసం ఆమె చేసిన సేవలను గుర్తించిన అధిష్టానం ఈ బాధ్యతలను అప్పగించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా తీగల పుష్పలత మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

## బెల్ట్ షాపులకు బ్రేక్.. నిర్వాహకులపై బైండోవర్ అస్త్రం



ముస్తాబాద్ మే 12( జనం సాక్షి) ముస్తాబాద్ మండలంలో అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు కొరడా ఝుళిపించారు. మంగళవారం బెల్ట్‌షాపు నిర్వాహకులను ముస్తాబాద్ ఎంఆర్ఓ ముందు హాజరుపరిచి బైండోవర్ చేసినట్లు ఎస్ఐ సిహెచ్. గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బైండోవర్ అయిన వారిలో పెద్దూరు శివకుమార్ కొండాపూర్ గ్రామానికి చెందిన వారు, పిడుగురాళ్ల ఎల్లయ్య గౌడు గూడెం గ్రామానికి చెందిన వారు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో చట్టానికి వ్యతిరేకంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తామని స్పష్టం చేశారు. అక్రమ మద్యం విక్రయాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ గణేష్ ఈ సందర్భంగా కోరారు.

# అన్నపూర్ణమ్మ ఫౌండేషన్‌కు ఒల్లెపు చందు చేయూత



**ముస్తాబాద్ మే 12( జనం సాక్షి)** ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో అన్నపూర్ణమ్మ ఫౌండేషన్ కు 7000 వేల రూపాయల గల విలవచేసి దినసరి వస్తువులను నూనెలు పప్పులు దినుసులు అన్నపూర్ణ ఫౌండేషన్ కు బహుకరించి 3000 వేల రూపాయలు నగదు అందించిన వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు ఒల్లెపు చందు .అన్నపూర్ణమ్మ ఫౌండేషన్ గూడెం కు ఇకనుంచి ఎప్పుడైనా సహాయం చేస్తానని తెలిపారు. వారిని అభినందించి ఈ కార్యక్రమంలో పాల్గొన్న సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి,ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భోంపెల్లి సురేందర్ రావు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సెస్ డైరెక్టర్ కొమ్ము బాలయ్య, బిఆర్ ఎస్ పార్టీ నాయకులు మెంగని మనోహర్,మాజీ ఉప సర్పంచ్ వార్డు మెంబర్ శాడా శ్రీనివాస్, మాజీ ఏం సి డైరెక్టర్ కోలా పర్శరాములు గౌడ్,ఒలేపు రవి తదితరులుపాల్గొన్నారు. అన్నపూర్ణమ్మ ఫౌండేషన్ సభ్యులు కుర్ర సావిత్రి, బొప్ప విజయ లక్ష్మి, స్వరూప,విజయ,బొప్ప పద్మాలత అభినందనలు తెలిపారు

## బండి భగీరథ్ అరెస్టుకు పట్టుబడుతున్న ఎస్ఎఫ్ఐ-డివైఎఫ్ఐ-ఐద్వా




**కరీంనగర్ టౌన్ మే 12 ( జనం సాక్షి)** కరీంనగర్‌లో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా జిల్లా కమిటీల ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ చేయాలని ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగరపు రజినీకాంత్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేష్ పటేల్ మాట్లాడుతూ, మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణల నేపథ్యంలో బండి భగీరథ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార బలంతో కేసును కప్పిపుచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన కుమారుడిపై నమోదైన పోక్సో కేసు విషయంలో నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మైనర్ బాలిక కుటుంబానికి భద్రత కల్పించి, సమగ్ర విచారణ జరపాలని కోరారు. గతంలో భగీరథ్‌పై ర్యాగింగ్, డ్రగ్స్ వినియోగం వంటి ఆరోపణలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి బెదిరింపులు వస్తున్నాయని, వెంటనే రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కాంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్, దుర్గం బోగేష్, గట్టు ఆకాష్, రత్నం సురేష్, రాకేష్, సందేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే డివైఎఫ్ఐ నాయకులు శివకుమార్, రాజ్‌కుమార్, అశోక్, అరవింద్, విజయ్, చందు, నితిన్ కుమార్ మరియు ఐద్వా నాయకురాళ్లు చెనీ రోజా, ఉప్పునూటి లక్ష్మి పాల్గొన్నారు.

# నీటి వినియోగాన్ని ఆదా చేయడం

## సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ఏవో అనూష




**ముస్తాబాద్ మే 12 (జనం సాక్షి)** ముస్తాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అన్నదాతల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి అనూష మాట్లాడుతూ యూరియా ,వినియోగాన్ని తగ్గించడం, సాగు ఖర్చులను నియంత్రించడం, నేల సారాన్ని పరీక్షించడం, నీటి వినియోగాన్ని ఆదా చేయడం సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వాటి విషయాలను వివరంగా తెలిపారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, సబ్సిడీలు సన్నగింజలు వడ్ల రకాల గురించి రైతులకు సమగ్ర సమాచారం రైతులకు అందిస్తూ ప్రతి గ్రామంలో ఏఈవోలు అవగాహన కల్పిస్తూ ఆయిల్ పామ్ సాగు అందుబాటులో ఉన్న సబ్సిడీల గురించి వివరించారు. వర్మి కంపోస్టింగ్ పై అవగాహన కల్పించి సేంద్రియ ఎరువుల తయారీ విధానం వాటి ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి ప్రియదర్శిని అసిస్టెంట్ ప్రొఫెసర్, అగ్రికల్చర్ అధికారి వి గోవర్ధన్, పి శ్రీధర్ ఎం హరిప్రియ, ఉపసర్పంచ్ తాళ్ల విజయ్ రెడ్డి , చుంచు మల్లన్న, తాళ్ల రాజు, శీల ప్రశాంత్, రైతులు ఆదర్శ రైతు వాలంటీర్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు

## టిబి ముక్తి భారత్ ప్రోగ్రాం



**ముస్తాబాద్ మే 12 (జనం సాక్షి)** ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా టీబి ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల ప్రోగ్రాం హైరిస్క్ గ్రామాలలో కార్యక్రమం జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశాల మేరకు , జిల్లా వైద్యాధికారిని డాక్టర్. రజిత ఆదేశానుసారం మండల వైద్యాధికారి. ఆఫీజ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. 94 మంది హైరిస్క్ వాళ్లకి ఎక్స్ తీయడం జరిగింది. ఈ కార్యక్రమం లో నామాపూర్ సర్పంచ్ మాదాసు అనిల్ ఉపసర్పంచ్ తాడేపు కొమురయ్య , హెచ్ ఎస్ ప్రసాద్ టీబి సూపర్వైసర్స్ మహిపాల్ మరియు జేత్య రజిత, ప్రవళిక, టెక్నీషియన్ బాలు, మరియు ఏఎన్ఎంలు జలంద్ర, దేవిక ఆశా వర్కర్స్ పాల్గొనడం జరిగింది.

# వైద్యం కోసం ఎదురుచూపులు.. నిరుపేద కుటుంబాన్ని ఆదుకోండి..

**గంభీరావుపేట ఏప్రిల్ 12(జనంసాక్షి);**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో షేక్ మహమ్మద్ గత నాలుగు నెలల నుండి పక్షవాతంతో బాధపడుతు రెకార్డుతే డొక్కాడని నిరుపేద కుటుంబం వారికి స్వంత ఇల్లు కూడా లేదు అద్దె ఇంట్లో కిరాయికుంటూ జీవిస్తూ ఉంటారు. వారికి సంతానం కూడా లేదు. పోషించే వ్యక్తి మంచాన పడడంతో ఇంట్లో చిల్లి గవ్వలేక వైద్యం చేయించుకోవడానికి ఉన్న డబ్బులు ఖర్చు చేసి మళ్లీ వైద్యానికి వెళ్లాలంటే డబ్బులు లేక ఆ నిరుపేద కుటుంబం దాతల సహకారం కొరకు ఎదురుచూస్తున్నారు ఎవరైనా దాతలు ముందుకు వచ్చి వైద్యానికి సహకరించాలని వేడుకుంటున్నారు. వారి బ్యాంకు అకౌంట్ నెంబర్ 62455859600. ఎస్బిఐ, ఎన్, 0021810 ఎవరైనా దాతలు సహకరించి నా భర్తను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. బాధితుల ఫోన్ నెంబర్ కు9642273927 ఆదుకునే వారు సంప్రదించాలని కోరారు..



# నన్ను కెలికారు.. అవినీతి గడీలను బద్దలు కొడతా



కరీంనగర్ జన సంద్రమైంది. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి బండి సంజయ్ ఉద్వేగ భరిత ప్రసంగం చేశారు. ఈ లైట్ల ఫోకస్ ఎక్కువైంది. నేను మాట్లాడుతుంటే లైట్ల కాంతికి కళ్లల్లో నీళ్లు వస్తే ఏడుస్తున్నానని అనుకునేరు. నేను భయపడ. బండి సంజయ్ కంట తడి పెట్టే రకంకాదు. టవర్ సర్కిల్ పై కాషాయ జెండాను ఎగరేశాం. కరీంనగర్ ప్రజలకు హ్యాట్సాఫ్. హిందువుల ఐక్యతను చాటేందుకే 16 ఏళ్లుగా హిందూ ఏక్తా యాత్ర చేస్తున్నా. జై శ్రీరాం అనే నినాదమే హిందూ ధర్మాన్ని కాపాడుతుంది. హిందూ సమాజానికి ఆపదొస్తే జై శ్రీరాం నినాదంతో తెగించి కొట్లాడతాం.కరీంనగర్ గడ్డ రక్తం నాలో ప్రవహిస్తుంది. కరీంనగర్ లో గల్లీగల్లీలో ప్రజా సమస్యలపై కొట్లాడిన. చిన్న కార్యకర్తగా మొదలైంది నా ప్రస్తానం, నా జీవితం కష్టాలు, బాధలే, బాధలను చూసి భయపడి పారిపోయేటోడ్ని కానన్నారు. మీరే నా కుటుంబం. సమాజమే నా ఇల్లు అనుకున్న, హార్ట్ లో స్టంట్ ఉన్నా హార్ట్ ఫుల్ గా 1600 కి.మీలు నడిచిన, తెలంగాణ ప్రజల కష్టాలను పంచుకున్న, నాటి పాలకులు నాపై రాళ్ల దాడి చేసినా, 109 కేసులు పెట్టి జైలుకు పంపినా భయపడలేదాన్నారు. ఏ హిందువుకు ఆపదొచ్చినా అండగా ఉన్నా, మీ ఇంట్లో పెద్ద కొడుకునైన, నా టైమంతా సమాజానికే ఇచ్చిన, నా కొడుకుకు టైమియ్యలేక పోయిన, నా కొడుకును క్రిమినల్ గా చూపే ప్రయత్నం చేస్తున్నారు. నేను ఏ తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు అయినా నా కొడుకును నేను సమర్థించడం లేదు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా, కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తాం, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు అని తెలిపారు.నా భార్య సైతం నన్ను ఫాలో అవుతోందని, నేనున్నా లేకున్నా కార్యకర్తలకు చేతనైనంత సాయం చేస్తోందని, నేడు నా కుటుంబానికి నిప్పంటించారని, ఆ నిప్పుతో అవినీతి వ్యవస్థను దగ్ధం చేస్తా, అవినీతి, కుట్రలు చేసే గడీల బద్దలు కొడతా. నన్ను, నా కుటుంబాన్ని, నా కార్యకర్తలను ఇబ్బంది పెట్టినోడిని విడిచి పెట్టే ప్రసక్తే లేదని తెలిపారు. ఇయాళ నా కొడుకు పై జరుగుతున్న దాడిని చూసి కన్నపేగు తల్లడిల్లుతోంది. నా కొడుకు సంఘటన మమ్మల్ని ఇబ్బంది పెడుతుంటే, 29 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటుంటే ఆ కుటుంబాలు పడుతున్న క్షోభ గుర్తుకొస్తోంది. శ్రీ రామ చంద్రుడికే కష్టాలు తప్పలేదు. శ్రీరామ చంద్రుడే నాకు ఆదర్శం అని కష్టాలు భరిస్తా. ఆనాడు రాక్షసులు ఆంజనేయస్వామికి నిప్పంటిస్తే ఏమైంది? లంకా దహనమైంది. నేను హనుమంతుడి భక్తుడిని. నా కుటుంబానికి నిప్పంటించారు. ఆ నిప్పుతో అవినీతికి పాల్పడుతూ కుట్రలు చేసే వాళ్ల సామ్రాజ్యాన్ని దహనం చేస్తా అని, అవినీతి గడీలను కూల్చివేస్తా. వదిలిపెట్టే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.

# ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు

## ఘనంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పుట్టినరోజు వేడుకలు

**నిజామాబాద్ అర్బన్ మే 12 జనంసాక్షి**
ఇందూరు ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతానని, నిరంతరం ప్రజల మధ్య ఉండడమే తన కిష్టమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే పుట్టినరోజును పురస్కరించుకొని నగరంలోని ఆయా డివిజన్లో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందూరు నగర ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యే గా ఎదిగానన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం పూర్వజన్మ సుకృతం అన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందజేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. నగరంలోని 19 డివిజన్ కంటేశ్వర్ ఆలయంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీ నారాయణ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. జిల్లా జనరల్ ఆసుపత్రిలో పేదలకు పండ్ల పంపిణీ చేపట్టారు. అలాగే మిర్చి కాంపౌండ్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. సుమారు 60 మంది అభిమానులు రక్తదానం చేశారు. 27వ డివిజన్ కార్పొరేటర్ కల్పే అర్చనా చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే 28వ డివిజన్ కార్పొరేటర్ మల్కాయ్ మహేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ



పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టు లు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ లో పాల్గొన్నారు. అలాగే స్నేహ సొసైటీలో దివ్యాంగ విద్యార్థులకు అన్నదానంతో పాటు పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఆర్మూర్ , మోర్తాడ్ లో అక్రమ ఇసుక రవాణా

ముప్పు ఏర్పడుతోందని అధికారులు తెలిపారు. అనధికారికంగా ఇసుక తవ్వకాలు జరగడం వల్ల భూగర్భ జలాల స్థాయి తగ్గిపోవడం , వ్యవసాయ భూములపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ, జిల్లాలో అక్రమ మైనింగ్ మరియు ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి వేళల్లో కూడా ప్రత్యేక బృందాలతో చెక్‌పోస్టులు , ప్రధాన రహదారులు మరియు గ్రామీణ మార్గాల్లో తనిఖీలు మరింత ముమ్మరం చేయనున్నట్లు తెలిపారు.ప్రజలు కూడా తమ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీస్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.



# బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

## కథలాపూర్ బిఆర్ఎస్ నాయకుల మీడియా సమావేశం

**కథలాపూర్ మే 12 (జనం సాక్షి)**
కథలాపూర్ మండల బి ఆర్ ఎస్ పార్టీ మీడియా సమావేశం లో నాయకులు మాట్లాడుతూ పొక్సో కేసులో నినీధితునగా ఉన్న బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలిమైనర్ బాలికను బెదిరిం చడంతో పాటు పాటు లైంగిక వేధింపులకు పాల్పడిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ పై ఫోక్సో కేసు నమోదు అయినప్పటికీ మైనర్ బాలిక తల్లిదండ్రులు మూడు నెలల క్రితం ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని తప్పు పట్టారు. వారికీ అండగా మా బి ఆర్ ఎస్ పార్టీ ఉంటదని..మైనర్ బాలికను తీవ్రంగా వేధించడంతో భగీరథను నేటికీ అరెస్టు చేయక పోవడం దారుణం అన్నారు.బండి సంజయ్ కుమారుడి పై గతంలో చాలా కేసులు ఉన్నాయని వెంటనే బండి భగీరథను అరెస్టు చేసి కఠిన చర్యలు చేపట్టాలని బాధిత మైనర్ బాలిక కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని లేనిపక్షంలో వారికీ న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అలాగే బాలిక కుటుంబ సభ్యులను బెదిరింపులకు గురి చేస్తున్న బండి సంజయ్ పై కేసు నమోదు. చేయడంతో పాటు బాధిత బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసిన నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ అధికారులను బి ఆర్ఎస్ పార్టీ తరపున కూడా హెచ్చరిస్తున్నానీఅధికారం ఎప్పుడూ ఒకరి చేతిలో ఉండాదని గుర్తించుకోవాలి.ఇట్లు కథలాపూర్ మండల బి ఆర్ఎస్ పార్టీ నాయకులు గడ్డం భూమారెడ్డి కిరణ్ రావు వేణు మామిడిపెల్లి రవి, జలందర్, గడ్డం శ్రీను పలువురు పాల్గొనడం జరిగింది.

# ఆసుపత్రిలో నర్సు దినోత్సవం వేడుకలు

## నర్సుల పాత్ర వెలకట్టలేనిది: డాక్టర్ ఉమాకాంత్

**పెద్ద కొడప్గల్ మే 12 (జనంసాక్షి):**
పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నర్సు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఉమాకాంత్ మాట్లాడుతూ... వైద్య రంగంలో నర్సుల పాత్ర వెలకట్టలేనిదని తెలిపారు. మానవ సేవలో నర్సుల అంకిత భావం, సేవాస్ఫూర్తిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమాకాంత్, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.



# వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

## చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుంది: శ్యామప్ప

**పెద్ద కొడప్గల్ మే 12 (జనంసాక్షి):**
పెద్ద కొడప్గల్ మండలంలోని వడ్లం గ్రామంలో మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్యామప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు వరి పంటను ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని సూచించారు. దళారులను నన్ను మోసపోవద్దని, ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, హమాలీలు, రైతులు పాల్గొన్నారు.



# బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

## - అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆగ్రహం



**కామారెడ్డి ప్రతినిధి, మే 12 (జనంసాక్షి)**
కామారెడ్డి పట్టణంలోని ఇందిరా చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తూ కాంగ్రెస్ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.కేంద్రమంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్నీ పోలీసులు అడ్డుకున్నారు.పోలీసుల కాంగ్రెస్ పార్టీ తోపులాటల మధ్యలో బండి సంజయ్ దిష్టిబొమ్మ, దహనం చేశారు. బండి సంజయ్ తన పదవిని అడ్డుపెట్టుకుని కేసులను ప్రభావితం చేయాలని చూస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహావేశాలతో నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఐరేనీ సందీప్ మాట్లాడుతూ ...కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వెంటనే అరెస్ట్ చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న అధికారాన్ని ఉపయోగించి పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చి కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. హనీట్రాప్ కేసుల పేరుతో అసలు అంశాన్ని మళ్లించే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో అందరికీ ఒకే న్యాయం ఉండాలని, కానీ బీజేపీ పాలనలో అధికారంలో ఉన్నవారికి ఒక న్యాయం, సామాన్య ప్రజలకు మరో న్యాయం జరుగుతోందని తీవ్రంగా విమర్శించారు. కేంద్ర మంత్రిగా ఉండి అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ బాధితులపైనే కేసులు పెట్టించే పరిస్థితి తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. బండి సంజయ్ మంత్రి పదవిలో ఉన్నంత వరకు ఈ కేసులో నిష్పక్షపాత దర్యాప్తు జరగదని, వెంటనే ఆయనను పదవి నుండి తొలగించాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, కామారెడ్డి రూరల్ అధ్యక్షులు రాజా గౌడ్, రామాగౌడ్, గుడుగుల శ్రీనివాస్, రామ్మోహన్, కాళ్ల గణేష్, అజ్మత్, ఆనందరావు, గ్యార సాయిలు, అంజద్, లడ్డు, కళ్లెం సత్యం, భూమణి బాలరాజు, వల్పిశెట్టి శెట్టి భాస్కర్, అన్వర్ అహ్మద్, జావిద్, గీరెడ్డి మహేందర్ రెడ్డి, మీసాల రమేష్, సాయిలు, ప్రభాకర్, హనుమాన్ల రాము, భరత్ టింకు, సుఫియాన్, వడ్ల సురేష్, దువల నరేష్, శేఖర్, పటేల్ కుమార్, ఫణీంద్ర, హనుమాన్ల రవి, శంకర్, ప్రవీణ్, అద్నాన్, అర్ఫాత్, లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ కార్యదర్శి లక్కపత్తిని గంగాధర్, తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# సిరికొండలో ఉపాధి హామీ కూలీలతో ఎస్ఐ సమావేశం

**సిరికొండ మే 12(జనం సాక్షి ):**
సిరికొండ మండలంలోనితాళ్ల రామడుగు గ్రామంలో “ మన ఊరు?మన బాధ్యత “ ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఉపాధి హామీ కూలీలతో సిరికొండ ఎస్ఐ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.కూలీలకు పని ప్రదేశాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో గ్రామ ప్రజలు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య లోపం అపరిశుభ్రంగా కోనేరు

**మల్యాల మే 12 (జనంసాక్షి)**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో పెద్ద హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా ముగిసాయి.
అధికారులు ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెబుతున్న క్షేత్రస్థాయిలో మాత్రం విఫలం అవుతూనే ఉన్నారు



**అపరిశుభ్రంగా కోనేరు**
భక్తులు కోనేటిలో చేసే స్నానని పుణ్యస్నానాలుగా భావిస్తారు కానీ నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో మురికిగా మారాయి కోనేటి చుట్టూ భక్తులు పడవేసిన దుస్తులతో అపరిశుభ్రంగా మారింది చాలామంది కోనేరులో స్నానం చేయలేక పక్కనే ఏర్పాటు చేసిన నల్లాల కింద స్నానాలు చేశారు. ఎప్పటికప్పుడు నీటిని శుభ్రం చేసి కోనేటిని అందుబాటులో ఉంచితే బాగుండేదని భక్తులు కోరుకుంటున్నారు.



**అపరిశుభ్రంగా కళ్యాణ కట్ట**
భక్తులు సమర్పించుకునే తలనీనాలు ఎప్పటికప్పుడు తీసివేయకపోవడంతో కళ్యాణకట్ట పరిసరాలు అపరిశుభ్రంగా చుట్టూ వెంట్రుకలతో ఉండడంతో నడవడానికి ఇబ్బంది పడ్డారు.టికెట్ల రూపంలో చార్జీలు చేస్తున్న పూర్తిస్థాయిలో వారికి ప్రశాంత వాతావరణంలో మొక్కులు చెల్లించుకునే విధంగా చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు.

# బోయినపల్లిలో సంక్షేమ ఫలాల పంపిణీ 57 మందికి కళ్యాణలక్ష్మి, 130 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

**బోయినపల్లి, మే 12 (జనంసాక్షి)**
మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం లబ్ధిదారులకు సంక్షేమ పథకాల చెక్కులను ఘనంగా పంపిణీ చేశారు. కళ్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి (సి.ఎం.ఆర్.ఎఫ్), రైతు బీమా పథకాలకు సంబంధించిన చెక్కులను ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి అందజేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మోయినోద్దీన్ మాట్లాడుతూ మండలంలో వివిధ పథకాల కింద అందుతున్న కళ్యాణలక్ష్మి 57 మంది లబ్ధిదారులకు ?57,06,612 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు మండలంలో మొత్తం 287 కళ్యాణలక్ష్మి చెక్కులను అందించినట్లు ఆయన పేర్కొన్నారు.సి.ఎం.ఆర్.ఎఫ్: అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొంది దరఖాస్తు చేసుకున్న 130 మందికి ?35,54,200 విలువైన ఆర్థిక సహాయం అందజేశారు.
రైతు బీమా: వివిధ కారణాలతో మృతి చెందిన ఐదుగురు రైతుల కుటుంబాలకు, ఒక్కొక్కరికి ?5 లక్షల చొప్పున రైతు బీమా చెక్కులను అందజేసి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలన్నదే లక్ష్యం. పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక, పంపిణీ జరుగుతోందనీ తహసీల్దార్ మోయినోద్దీన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, సర్పంచ్ నల్ల మోహన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమరెడ్డి మహేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.అలాగే ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, ఎంపీడీవో జయశీల, ఆర్.ఐ మనోజ్ కుమార్, ఏవో ప్రణీత, వివిధ గ్రామాల సర్పంచులు, జీపీఓలు మరియు లబ్ధిదారులు ఈ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# నేడు కామారెడ్డిలో నియోజకవర్గ స్థాయి సర్పంచ్ ల సమావేశం

**భిక్కనూరు మే 12 (జనంసాక్షి)**
రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు'విద్యా వారోత్సవాల'ను పురస్కరించుకొని బుధవారం మే 13న రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ స్థాయి సర్పంచ్ ల సమావేశాలు నిర్వహించనున్నారు.ఇందులో భాగంగా కామారెడ్డి నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వెనుక ఉన్న యోగ భవనంలో ఏర్పాటు చేశారు.

**విద్యా సంస్కరణలపై అవగాహన**
పాఠశాల విద్యలో ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు,విద్యా సంస్కరణలు,మౌలిక వసతుల కల్పనపై సర్పంచ్ లకు అవగాహన కల్పించడమే ఈసమావేశం ప్రధాన ఉద్దేశ్యం. ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు సాగే ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన విద్యాధికారులు,సర్పంచ్ లు పాల్గొని విద్యావ్యవస్థ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు.
ఈసమావేశానికి హాజరుకావాలని కోరుతూ మండలం లోని వివిధ గ్రామాల సర్పంచ్ లకు పంచాయతీ కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయుల ద్వారా ఇప్పటికే ఆహ్వాన పత్రాలు అందజేశారు.



ఈక్రమంలో భిక్కనూరు గ్రామ సర్పంచ్ శ్రీమతి బాల్యాల రేఖ సుదర్శన్ ను భిక్కనూరు జిల్లా పరిషత్ బాలికల ప్రధానోపాధ్యాయులు,మండల విద్యాధికారి ఆర్.రాజ గంగారెడ్డి గారు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈక్రమంలో పంచాయతి కార్యదర్శి మహేష్ కుమార్ గౌడ్, వార్డు సభ్యులు కర్రోళ్ల రాజు, నరేష్ గౌడ్,ఉప సర్పంచ్ దుంపల మోహన్ రెడ్డి,బల్యాల సుదర్శన్ తదితరులు పాల్గొని,మన పాఠశాలల అభివృద్ధిలో సర్పంచ్ ల పాత్ర కీలకమని, కావున నియోజకవర్గంలోని సర్పంచ్ లందరూ ఈసమావేశానికి హాజరై విజయవంతం చేయాలని విద్యాశాఖ అధికారులు కోరారు.

## లారీ-ట్రాక్టర్ ఢీ



- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
- అతివేగమే ప్రమాదానికి కారణం
- ఇందల్వాయి ఎస్సై ఆధ్వర్యంలో దర్యాప్తు

**ఇందల్వాయి, జనం సాక్షి:**
నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం గన్నారం గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జాతీయ రహదారి 44పై జరిగిన ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు.
వివరాల్లోకి వెళ్తే..నిన్న సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో చంద్రాయనపల్లి గ్రామానికి చెందిన గణపురం రాములు, కుపీర్యాల సురేష్‌లు ట్రాక్టర్‌పై వెళ్తుండగా, వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఒక లారీ అజాగ్రత్తగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ట్రాక్టర్‌పై ఉన్న గణపురం రాములు అక్కడికక్కడే మృతి చెందగా, కుపీర్యాల సురేష్ తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ఇందల్వాయి ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించగా, మృతుడు రాములు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, లారీ డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉంది.

## నరేందర్ రెడ్డిని సన్మానించిన అల్ఫోర్స్ పాఠశాల సిబ్బంది



**సుల్తానాబాద్,మే 12(జనంసాక్షి) :** ఆల్ ఫోర్స్ సుల్తానాబాద్ పాఠశాలలో సీబీఎస్ఈ అనుమతి రావడంతో సిబ్బంది అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు. అల్ఫోర్స్ పాఠశాల ప్రిన్సిపాల్ తో పాటు సిబ్బంది ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేతను భోకే అందజేసి ఘనంగా చాలుతో సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆల్ ఫోర్స్ పాఠశాలకు సీబీఎస్ఈ అనుమతి రావడంతో మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులను మరింత ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు.



## బండి భగీరద పై చర్యలు తీసుకోవాలి

**సైదాపూర్ మే 12 (జనంసాక్షి)**
బండి భగీరద పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్ర సమితి మాజీ మండల అధ్యక్షులు సోమారపు రాజయ్య డిమాండ్ చేశారు. సైదాపూర్ మండలకేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశం లో అయన మాట్లాడుతూ ఫోక్సో కేసు నమోదై రోజులు గడుస్తున్నా ఇంత వరకు అరెస్ట్ చేయక పోవడం పట్ల ఆంతర్యం ఏమిటని ప్రశ్నించ్చారు. న్యాయం పేదవారి కైన పెద్ద వారి కైనా ఒకే విధం గా ఉండాలన్నారు. సమావేశం లో మాజీ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి మాజీ వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్ రెడ్డి సర్పంచ్ తొంట రజినీకాంత్ భారత రాష్ట్ర సమితి మండలమాజీ ప్రధాన కార్యదర్శి చెల్మ ల రాజేశ్వర్ రెడ్డి ఉప సర్పంచ్ వీర స్వామి.నాయకులు రవీందర్ గౌడ్ మునిపల శ్రీనివాస్ పి నారాయణ జీ శ్రీధర్. రవి మా హీపాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## తాహసిల్దార్ రామ్ చందర్ ను సన్మానించిన మండల రేషన్ డీలర్లు

**మల్లాపూర్, మే 12(జనంసాక్షి)**
నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తాహసిల్దార్ శ్రీ రామ్ చందర్ ను మండల రేషన్ డీలర్ల సంఘం తరపున ఘనంగా సన్మానించరు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దప్పుల నర్సయ్య , గౌరవ అధ్యక్షులు ముద్ధం ప్రకాష్ , గంగాధర్ , వెంకట్, లలిత , ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.



## నాయిబ్రాహ్మణ విద్యార్థి హాస్టల్ వసతి గృహ ట్రస్ట్ కమిటీ సమావేశం

**కరీంనగర్ టౌన్ మే 12 (జనంసాక్షి)**
ఈరోజు తెలంగాణ నాయిబ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జంపాల నర్సయ్య అధ్యక్షతన నాయిబ్రాహ్మణ విద్యార్థి హాస్టల్ వసతి గృహ ట్రస్ట్ కమిటీ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు రాచకొండ విఠలేశ్వర్, తెలంగాణ నాయిబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హాజరయ్యారు. సమావేశంలో విద్యార్థి హాస్టల్ వసతి గృహ అభివృద్ధి కోసం భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చ జరిగింది. అదేవిధంగా ట్రస్ట్ కమిటీ నూతన ఎన్నికల నిర్వహణ కోసం ఆరుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో కన్వీనర్‌గా రాచకొండ ప్రభాకర్‌ను ఎన్నుకోగా, సభ్యులుగా అవుదుర్తి విజయ్ కుమార్, గడ్డం హరికిషన్, శ్రీరాముల బాలసురేందర్, అందుర్తి గంగాధర్, శ్రీరాముల రమేష్‌లను నియమించారు. ఈ కమిటీ నెల రోజుల్లో నూతన ట్రస్ట్ కమిటీ ఎన్నికలను నిర్వహించనున్నట్లు తెలిపారు.భవిష్యత్తులో నాయిబ్రాహ్మణ విద్యార్థి హాస్టల్ వసతి గృహ అభివృద్ధి కోసం సమర్థవంతంగా పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు, ట్రస్ట్ కమిటీ సభ్యులు మందపల్లి అంజయ్య, గర్శకుర్తి రాజశేఖర్, శ్రీరాముల రమేష్, కొత్వాల అశోక్, శ్రీరాముల శ్రీకాంత్, ముత్యాల లక్ష్మణ్, గర్శకుర్తి రవీందర్, సమ్మెట లక్ష్మణ్, కంది రవి, కొత్వాల అంజనేయులు, గర్శకుర్తి విద్యాసాగర్, కొత్వాల ప్రసాద్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

### పేదల సొంతింటి కల సాకారం చేస్తున్న ప్రభుత్వం

### గ్రామంలో ఆనందం



**బాన్సువాడ మే 12 (జనంసాక్షి)**
నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలో తీరంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక పథకం ద్వారా పేద కుటుంబాల సొంతింటి కల నెరవేరుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఆనంద వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా లబ్ధిదారులు గొంటి నిర్మల ? సురేష్ దంపతులు తమ కొత్త ఇంటి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో సంప్రదాయ పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సైదవ్వ సాయిలు ముఖ్య అతిథిగా హాజరై శుభారంభం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.అలాగే ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.
గ్రామాభివృద్ధిలో భాగంగా ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తమకు సొంతిల్లు కల నిజమవుతోందని లబ్ధిదారులు నిర్మల ? సురేష్ దంపతులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో మరిన్ని కుటుంబాలు కూడా ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాయని స్థానికులు తెలిపారు.గ్రామంలో ఈ కార్యక్రమం పట్ల హర్షాతిరేకం వ్యక్తమవుతుండగా, త్వరలోనే అన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి పేదలకు గృహప్రవేశాలు జరిపే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.



## బస్టాండ్ ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నంను కలిసిన కాంగ్రెస్ నేతలు

### సానుకూలంగా స్పందించిన మంత్రి



**కామారెడ్డి ప్రతినిధి, మే 12 (జనంసాక్షి)**
కామారెడ్డి జిల్లా కేంద్రంలో హైవే ఎక్స్ ప్రెస్ ప్రత్యేక బస్టాండ్ ఏర్పాటు చేయాలని తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు వినతిపత్రం అందించారు. మంగళవారం రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కామారెడ్డి కాంగ్రెస్ నేతల బృందం ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం అందించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో నూతన బస్టాండ్ ఏర్పాటు విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారని వివరించారు. ఈ సందర్భంగా టిఎస్ఆర్టీసీ ఎండి, కామారెడ్డి జిల్లా కలెక్టర్ బస్టాండ్ ఏర్పాటు సాధ్యసాధ్యాలు, స్థలం కేటాయించాలని మంత్రి ఆదేశించినట్లు తెలిపారు.కామారెడ్డి జిల్లా కేంద్రం ఉత్తర తెలంగాణలో ప్రముఖ పట్టణంగా విస్తరిస్తుందని పలు విషయాలు మంత్రి పొన్నం దృష్టికి టీపీసీసీ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి తీసుకొచ్చారు. ప్రస్తుతం కామారెడ్డి పట్టణం లక్ష జనాభాకు పైగా ఉందని, ప్రస్తుతం పట్టణం నలువైపులా విస్తరిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న కొత్త బస్టాండ్ విస్తీర్ణం తక్కువగా ఉండటం వల్ల రాకపోకలకు ఇబ్బందులు తలేత్తుతున్నాయి. మరోవైపు 44వ జాతీయ రహదారి విస్తరణ జరగడంతో ఆర్మూర్, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, నాగ్ పూర్, కోరుట్ల, మెట్ పల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు కామారెడ్డి పట్టణంలోకి రావడం లేదు. నాన్ స్టాఫ్ బస్సుల కారణంగా కామారెడ్డికి రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి 44వ జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ పరంగా, ఆర్టీసీకి అనుకూలంగా భూమి ఉన్నందున అ స్థలంను కేటాయించి నాన్ స్టాఫ్ బస్టాండ్ కానీ హైవే బస్టాండ్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరామని వివరించారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో కీలకమైన కామారెడ్డి నుంచి రాకపోకలు కొనసాగించేలా హైవే బస్టాండ్ ఏర్పాటు చేయాలని దీని కారణంగా ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు రాకపోకలు సాఫీగా జరిగే అవకాశం ఉంటుందని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మంత్రికి ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. మంత్రిని కలిసిన వారిలో అడ్లూర్ కౌన్సిలర్ గడ్డమిది మహేష్, డీసీసీ ఉపాధ్యక్షులు నిమ్మ విజయ్ కుమార్ రెడ్డి, క్రెడా అధ్యక్షులు గణగోన లక్ష్మి నర్సాగౌడ్, కాంగ్రెస్ నేతలు శ్రీధర్ రావు ఉన్నారు.

# అంజన్న జన్మదినం కొండంతా జనం

**కొండగట్టులో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు**

**కాషాయమయంగా మారిన ఆలయ పరిసరాలు**

**జైశ్రీరామ్ జై హనుమాన్ నామస్మరణలతో మారుమోగిన కొండగట్టు**

**మల్యాల మే 12 (జనంసాక్షి)**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో వైశాఖ బహుళ దశమి సందర్భంగా నిర్వహించే హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి స్వామి వారి పర్వదినము హనుమాన్ జయంతి కావడంతో దీక్ష స్వాములు భక్తులు భారీ ఎత్తున స్వామి వారి దర్శనానికి తరలివచ్చారు. మంగళవారం తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి,లక్ష పుష్పాలు మరియు రకరకాల ఫలాలతో తమలపాకులతో మూలవిరాట్‌ను కన్నులపండువగా అలంకరించారు.

**అంజన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు**

ఆలయ పరిసరాలు దీక్షా స్వాములు భక్తులతో కాషాయమయంగా మారింది జైశ్రీరామ్ జై హనుమాన్ నామస్మరణలతో మారుమోగింది కోరిన కోరికలు తీర్చే అంజన్నకు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆంజనేయ స్వామికి ముడుపు కట్టి భక్తితో మండల 41 రోజులు,అర్ధ మండల 21 రోజులు,పావు మండల 11 రోజుల దీక్షలు తీసుకున్న స్వాములు కాలినడకన వాహనాలలో కొండగట్టుకు చేరుకున్న దీక్ష స్వాములు భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇతర రాష్ట్రాల నుంచి సోమవారం సాయంత్రమే కొండపైకి చేరుకొని బస చేసి అర్ధరాత్రి 12 గంటలు దాటగానే మంగళవారం స్వామివారి దర్శనానికి పోటెత్తారు మాల విరమణ చేసి కేశఖండనం చేసుకొని కోనేటిలో పవిత్ర స్థానాలచరించి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని స్వామివారి ప్రసాదాలను తీసుకొని చల్లంగా చూడు మల్ల వస్తానంటూ తిరుగు ప్రయాణమయ్యారు


**యజ్ఞశాలలో కార్యక్రమాలు**

దేవతారాధన మరియు హోమం వంటి వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా ద్రావిడ ప్రబంధ పారాయణాలు,విశేష అభిషేకాలు, తులసీ అర్చన,పట్టు వస్త్రాల అలంకరణ, సహస్రనాగవల్లి అర్చనలు వైభవంగా నిర్వహించారు. అనంతరం హోమం,మహాపూర్ణాహుతి,స్నపన తిరుమంజనం, ఉయ్యాల సేవ కార్యక్రమాలు నిర్వహించారు. సామూహిక భజనలు, మంత్రపుష్పం, మహానివేదనం అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

సాయంత్రం ఆరాధన కార్యక్రమాలతో పాటు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, అమ్మవారి కుంకుమార్చన, ఓడిబియ్యం, సహస్ర దీపాలంకరణ, గరుడవాహన సేవ,కంకణోద్వాసన కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. గరుడవాహన సేవలో స్వామివారి ఉత్సవమూర్తులను దర్శించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మహాదాశీర్వాదం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

**ఆంజనేయ స్వామి దర్శించుకున్న ఎమ్మెల్యేలు**


హనుమాన్ జయంతి సందర్భంగా వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రామారావు స్వామివారిని దర్శించుకున్నారు ఆలయ అధికారులు అర్చకులు వారికి ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వదించారు ఆలయ ఈవో అంజన రెడ్డి ఎమ్మెల్యేలను శాలువాతో సత్కరించి స్వామివారి



ప్రసాదాన్ని అందజేశారు.
ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని,ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని, ముఖ్యంగా రైతాంగానికి సమృద్ధిగా వానలు కురిసి పంటలు బాగా పండాలని స్వామివారిని వేడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని ఆలయ అధికారులను ఆదేశించారు.

**భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు**

దీక్షా విరమణ కోసం వచ్చే భక్తులకు మాల విరమణ



కోసం 300 మంది అర్చకులను,తలనీలాల సమర్పణ కోసం 1500 మంది నాయి బ్రహ్మణులను అధికారులు నియమించారు. 4 ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. కొండపైకి చేరేందుకు ఆర్టీసీ ఉచిత బస్సులను ఏర్పాట్లు చేశారు.

**కట్టుదిట్టమైన భారీ భద్రత ఏర్పాటు**

జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఎస్పీ అశోక్ కుమార్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బాంబు స్క్వాడ్ తో తనిఖీలు, 950 పోలీస్ బందోబస్తుతో 6 సెక్టార్లుగా విభజించి మూడు షిఫ్టులలో విధులను కేటాయించి క్యూ లైన్ లలో పార్కింగ్ మరియు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా వీధులను సక్రమంగా పర్యవేక్షిస్తూ ఉత్సవాలను విజయవంతం చేశారు.














# రాష్ట్ర స్థాయి ఉచిత ఎం.కామ్ ఎంట్రన్స్ కోచింగ్ ప్రారంభం

## ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 40 రోజుల ప్రత్యేక శిక్షణ

**కరీంనగర్ టౌన్ మే 12 (జనంసాక్షి)**
కరీంనగర్‌లోని ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రాష్ట్ర స్థాయి ఉచిత ఆన్‌లైన్ ఎం.కామ్ పీజీ ఎంట్రన్స్ కోచింగ్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ప్రజా పాలన?ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాల సందర్భంగా కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ మార్గదర్శకాల మేరకు ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కరీంనగర్ మరియు కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ సంయుక్తంగా తెలంగాణ కామర్స్ అసోసియేషన్ సహకారంతో ఈ ఉచిత కోచింగ్‌ను నిర్వహిస్తున్నాయి. మే 12 నుంచి ప్రారంభమైన ఈ కోచింగ్ 40 రోజుల పాటు కొనసాగనుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఇందులో పాల్గొంటున్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో నిర్వహించే ఈ శిక్షణలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, కామర్స్ నిపుణులు ఎం.కామ్ ప్రవేశ పరీక్షకు అవసరమైన సబ్జెక్ట్ పరిజ్ఞానం, మోడల్ పరీక్షలు, ప్రశ్నాపత్ర విశ్లేషణ, సమయ నిర్వహణ, పరీక్షా వ్యూహాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు. ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య వక్తలుగా డాక్టర్ ఎం. మల్లారెడ్డి, డాక్టర్ హర్జోత్ కౌర్ పాల్గొని విద్యార్థులకు ప్రవేశ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక అంశాలపై మార్గనిర్దేశనం చేశారు. గత సంవత్సరం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉచిత కోచింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు ఎం.కామ్ ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 1వ, 3వ ర్యాంకులతో పాటు 14, 17, 25, 26, 29, 30, 37వ ర్యాంకులు సాధించి ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో చదువుతున్నారని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ తెలిపారు. ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ ఢ సైన్స్ కళాశాలకు చెందిన బి.కామ్ విద్యార్థిని పెరుమాండ్ల కాంక్షిత గత సంవత్సరం 38వ ర్యాంకు సాధించిందని, ఈసారి కూడా మెరుగైన ఫలితాల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ నితిన్ పాఠక్, కామర్స్ విభాగాధిపతి టి. రాజయ్య, కన్వీనర్ డాక్టర్ బూర్ల నరేష్, కో–కన్వీనర్ డాక్టర్ కే. అర్జున్, అధ్యాపకులు డాక్టర్ మల్లారెడ్డి, డాక్టర్ కే. రామకృష్ణ, బి. నర్మదా, రాములు, మల్లేశం, శిరీష, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.






**అవునూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ**

**ముస్తాబాద్ మే 12 (జనంసాక్షి)**
ముస్తాబాద్ మండలం అవునూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీలో సిసి రోడ్డు పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ నిధులు మంజూరైన సందర్భంగా ఇందిరమ్మ కాలనీలో సిసి రోడ్డు పనులను ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి లచ్చులు, పంచాయతీ కార్యదర్శి భూషణ్ మల్లికార్జున, ఉప సర్పంచ్ నక్కల రాజు, వార్డు సభ్యులు నేరెల స్వామి, తోట అంజయ్య, బందేపురి శ్రీనివాస్, పసిగంటి బాలయ్య, గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

# కరీంనగర్ ఆర్టీసీ రీజియన్‌లో గ్రీవియన్స్ డే నిర్వహణ



**కరీంనగర్ టౌన్ మే 12 (జనంసాక్షి)**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కరీంనగర్ రీజియన్ పరిధిలో మే 12న రీజనల్ మేనేజర్ కార్యాలయం సహా 11 డిపోలలో గ్రీవియన్స్ డే (ఉద్యోగుల సమస్యల పరిష్కార వేదిక) నిర్వహించారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు.
కరీంనగర్ రీజనల్ మేనేజర్ బి. రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా సమర్పించారు. ఉద్యోగుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని రీజనల్ మేనేజర్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్లు ఎస్. భూపతిరెడ్డి, పి. మల్లేశం, ఎం. సంపత్ కుమార్, పర్సనల్ ఆఫీసర్లు బి. సత్తయ్య, ఎన్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
ప్రతి నెల రెండో మంగళవారం ఈ గ్రీవియన్స్ డే నిర్వహించబడుతుందని అధికారులు తెలిపారు.

# బండి సంజయ్ అధికారాన్ని అడ్డం పెట్టుకొని కేసును నీరుగార్చేందుకు కుట్ర పన్నుతున్నారు

- అమ్మాయి వివరాలను బండి భగీరథ్ ఎలా బహిర్గతం చేస్తాడు
- కేసుకు బీజేపీకి సంబంధం లేకపోతే సోషల్ మీడియాలో పోస్టులు ఎందుకు
- సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్



**కరీంనగర్ టౌన్ మే 12 (జనంసాక్షి):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తనయుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసును నీరుగార్చేందుకు అధికారాన్ని ఉపయోగిస్తూ కుట్ర పన్నుతున్నారనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఆరోపించారు. బండి సంజయ్‌ను వెంటనే కేంద్ర మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేసి, ఈ వ్యవహారంలో బీజేపీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నాలుగు రోజుల క్రితం బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైనా ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కేసు నమోదు అనంతరం బాధిత బాలికకు సంబంధించిన వివరాలు, ఫోటోలు ఎలా బయటకు వచ్చాయని, వాటిని బండి భగీరథ్ ఎలా బహిర్గతం చేస్తాడని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో ఆయన తండ్రి బండి సంజయ్ సహకారం లేకుండా ఇది సాధ్యమా అని శ్రీనివాస్ ప్రశ్నించారు. ఈ ఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు, మహిళా సంఘాలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నప్పటికీ బీజేపీ నేతలు స్పందించకుండా కళ్లుండి చూడలేని కబోధిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇదే సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఈ కేసుకు పార్టీకి సంబంధం లేదని చెప్పడం ఆయన అవివేకానికి నిదర్శనమని అన్నారు. ఒకవైపు సంబంధం లేదని చెబుతూనే మరోవైపు బీజేపీకి చెందిన సోషల్ మీడియా గ్రూపులు, నాయకుల పేర్లతో ఉన్న అకౌంట్ల ద్వారా బాధిత బాలిక ఫోటోలను మార్ఫింగ్ చేసి, ఆమె వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా పోస్టులు పెడుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభక్క పేరుతో ఉన్న గ్రూపుల్లో కూడా ఇలాంటి పోస్టులు రావడం దారుణమన్నారు. ఒక మహిళ పేరుతో ఉన్న అకౌంట్ నుంచే బాలికను అవమానించేలా పోస్టులు రావడం అత్యంత నీచమైన చర్య అని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ నాయకుల పేర్లతో నడుస్తున్న వందలాది సోషల్ మీడియా గ్రూపుల్లో కూడా ఇలాంటి దుష్ప్రచారం కొనసాగుతోందని పేర్కొన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ తదితర సోషల్ మీడియా వేదికల్లో బాధితురాలిపై అసత్య ప్రచారం చేస్తున్న వారందరి అకౌంట్లను గుర్తించి, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.



# రైతుల కష్టాలు పట్టవు బలవంతంగా కండువాలు కప్పుతున్నారు

**రుద్రంగి మే 12 (జనంసాక్షి)**
ఉమ్మడి మనలా గ్రామం లో బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యం లో వడ్ల కొనుగోలు,మక్కల కొనుగోళ్ల విషయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. మానాల గ్రామంలో ఇప్పటి వరకి 2 లారీల ధాన్యం మాత్రమే మిల్లు కి పంపించడం జరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లా లో అత్యధికంగా మక్కలు మానాల గ్రామంలో పండిస్తే ఇక్కడ కొనుగోలు కేంద్రం పెట్టకుండా మండల కేంద్రం 10 కిలోమీటర్ల దూరంలో పెట్టడం వల్ల రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని,గ్రామంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు ప్రజలు పడుతున్న కష్టాలను పట్టించుకోకుండా మాయమాటలు చెప్పి మా పార్టీ నాయకులను బలవంతంగా పార్టీ కండువా కప్పడం ఎందుకుని మండి పడ్డారు. ఈ కార్యక్రమం లో మానాల సర్పంచ్ శంకర్ గౌడ్,బడితండ సర్పంచ్ రామదాస్, దేగావత్ తండా సర్పంచ్ సరిత తిరుపతి,మాజీ సర్పంచ్ నరహరి నాయక్, అన్ని గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు ఎంపీటీసీలు పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# రైతుల పేరుతో రాజకీయం చేస్తే బిఆర్ఎస్ కు పుట్టగతులు ఉండవు

## మండల అధ్యక్షుడు తూము జలపతి



**రుద్రంగి మే 12 (జనంసాక్షి)**
ఉమ్మడి మానాల గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమ్ జలపతి మరియు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడంలో విఫలమైందంటూ బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా తిప్పికొట్టారు, వడ్లు కొనడం లేదని కాంగ్రెస్ పార్టీని బదనాం చేయాలని చూడడం టిఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయడమే కాకుండా,సకాలంలో రైతులకు రైతు భరోసా అందిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాష్ట్ర యూనియన్ కోఆపరేటివ్ చైర్మన్ చైర్ మానాల మోహన్ రెడ్డి లు రైతుల కోసం ఎప్పటికప్పుడు అధికారులకు తగు సూచనలు సలహాలు అందిస్తూ కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి గింజను సేకరించేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారని, పదేళ్ల అధికారంలో ఉండి రైతులను విస్మరించిన బీఆర్ఎస్ ఇప్పుడు ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే విష ప్రచారం చేస్తుందని ఇలాంటి తప్పుడు ప్రచారాలను మార్చుకోకపోతే రానున్న రోజులలో ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఏడీఈ భూక్యా లక్ష్మణ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమ్ జలపతి, సర్పంచులు జవహర్ లాల్,,మంజుల రాజు,అశోక్ మానాల ఉపసర్పంచ్,గుగులోత్ మదన్ (బడీ తండా విడీసీ చైర్మన్),భూక్యా తిరుపతి,భానోత్ రమేష్,గుగులోత్ సరోజ వినోద్,గుగులోత్ రఘు,గుగులోత్ సంతోష్,గుగులోత్ రవి,బానోత్ లోక వీరితో పాటు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాగునీరు అందించడంలో రాజీ పడే ప్రసక్తే లేదు

- కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వం
- చివరి ఆయకట్టు వరకు నిరందిస్తాం
- ఎల్లమ్మ కాలువ పరిరక్షణ లక్ష్యం
- ప్రభుత్వ విప్,చింతకుంట విజయరమణరావు



**సుల్తానాబాద్,మే 12(జనంసాక్షి) :** రైతులకు సాగునీరు అందించడంలో రాజీ పడే ప్రసక్తే లేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు అన్నారు. మంగళవారం మండలంలోని గర్రెపల్లి గ్రామంలో పెద్ద చెరువు ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు బొంతకుంటపల్లి, గర్రెపల్లి గ్రామాల మధ్యలో ఉన్న ఎల్లమ్మ కాల్వ కూడిపోయి కబ్జాకి గురికావడంతో అధికారులు, స్థానిక నాయకులతో కలిసి కాలువను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి కబ్జాకి గురైన కాలువను సర్వే చేసి పూడిక తీసి 5 గ్రామాల రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగు నీరందిస్తున్నామని రైతులకు అవసరమైన సాగునీటి విషయంలో ఎలాంటి రాజీ పడేది ఉండదని తెలిపారు. రైతులకు సాగునీటి సరఫరా చేసే కాలువలను ఎవరైనా అన్యాక్రాంతం చేస్తే ఉపేక్షించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటి కాలువలను ఎల్లవేళలా పరిరక్షిస్తాం అని కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వం అని గుర్తు చేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలో రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి సందేహాలు లేవని నిండు ఎండా కాలంలో కూడా నియోజకవర్గ రైతన్నలకు అవసరానికి మించి సాగునీరందించామని తెలిపారు. గతంలో అధికారంలో లేనప్పటికి రైతుల కోసం కొట్లాడిన నైజం తనదని గతంలో తాను శాసనసభ్యులుగా లేనప్పుడు గత పాలకులు రైతులకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులకు గురిచేస్తే నిరసనగా ఎస్సారెస్పీ గేట్లను బద్దలు కొట్టి రైతులకు వెన్నుదన్నుగా ఉన్న నెపంలో తన మీద అప్పటి పాలకులు కేసులు పెట్టిస్తే సోమవారం కోర్టుకు కూడా హాజరు అవడం జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ తాను ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటామని మరోసారి తేటతెల్లం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, పలు గ్రామాల సర్పంచ్‌లు,ఉప సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ,నాయకులు, కార్యకర్తలు,రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## ధూప దీపాలకు సహకరించిన దంపతులకు సన్మానం

**సుల్తానాబాద్,మే 12(జనంసాక్షి) :** మండలంలోని శ్రీ పిల్లి గుండ్ల హనుమాన్ దేవాలయంలో దీప, ధూప నైవేద్యాలకు సహకరిస్తున్న దంపతులను ఘనంగా సన్మానించారు. అతి పురాతనమైన శ్రీ పిల్లిగుండ్ల హనుమాన్ దేవాలయం లో మంగళవారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అతి పురాతనమైన ఈ దేవాలయం గత కొంతకాలంగా భక్తుల సహాయ సహకారాలతో నిర్వహణ కొనసాగుతుందని పూసల కు చెందిన చొప్పరి కనకయ్య, కందునూరిపల్లె కు చెందిన మెండే శంకరయ్య దంపతులు సహకరిస్తున్నారని వారిని ఆంజనేయస్వామి చల్లగా చూడాలని దీవించారు. అనంతరం దంపతులను ఘనంగా సన్మానించారు. హనుమాన్ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు,నిర్వాహకులు పురం వినోద ప్రేమ్ చందర్ రావు లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రజా పాలన-ప్రగతిలో.. - ఆరోగ్య ప్రదాయిని యోగా..

**గోదావరిఖని, జనంసాక్షి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11 నుంచి 17 వరకు విద్యా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండవ రోజు ఆరోగ్య సంరక్షణ కొరకు యోగ సాధన.. ఉన్నత విద్య కొరకు ఉచిత కోచింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ ఏ.సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు అనునిత్యం తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా సాధన అభ్యాసం చేయాలన్నారు. వ్యాయామం, యోగాసనాలు ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. భారతీయ ఋషులు అందించిన అత్యంత విలువైన విద్య యోగా సాధన అన్నారు. ఇందులో ఎన్‌సీసీ క్యాడెట్స్ ఏ.భార్గవి, ఎం.నవ్యశ్రీ, అఖిల, పూజిత యోగా ఆసనాల ప్రదర్శన చేశారు. తదుపరి ఐసెట్ ద్వారా ఎంబిఏ, ఎంసీఏ, పీజీ సెట్ ద్వారా ఎంకామ్, ఎంఎస్‌సీ, ఎంఏ కోర్సుల్లో చేరదలుచుకున్న విద్యార్థుల కోసం ఉచిత ఉన్నత విద్య కోచింగ్ కోసం ఏర్పాటు చేసిన గోడ పత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సవిత,తిరుపతి, డాక్టర్ సురేష్, డాక్టర్ ప్రవంతి, ఉషారాణి, డాక్టర్ సమత, డాక్టర్ నరేష్, డాక్టర్ రామకృష్ణ, ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాస్,సతీష్, శ్రీలత, జలజ, షాకూర్, కలీమ్, అరవింద్ బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.





## డిజిటల్ టీవీలను ప్రారంభించిన ఎమ్మెల్యే..



**గోదావరిఖని, జనంసాక్షి:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో మంగళవారం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా రామగుండం శాసనసభ్యులు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ కళాశాలలో డిజిటల్ టీవీలను ( ఐఎఫ్‌పీసీ-ఐడీపీఎస్)లను ప్రారంభించారు. వాటి ఉపయోగాన్ని విద్యార్థులకు వివరిస్తూ వాటిని ఉపయోగించుకొని మంచి జ్ఞానాన్ని పొందాలని ఎమ్మెల్యే సూచించారు. కళాశాలకు.. ఈ ప్రాంతానికి విద్యార్థులు మరింత మంచి పేరు తీసుకురావాలని, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం కళాశాలలో టాప్ మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపెల్లి ఎల్లయ్య, స్థానిక కార్పొరేటర్ పద్మావతి రంజిత్, కళాశాల ప్రిన్సిపల్ సంజీవయ్య,వన్‌టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి, కళాశాల సీనియర్ అధ్యాపకులు మంతెన శ్రీనివాస్, కుక్కడపు శ్రీనివాస్,కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన - మాజీ జడ్పీ వైస్ చైర్ పర్సన్



**ఎలిగేడు,మే 12(జనంసాక్షి)** ఎలిగేడు మండలంలో మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా మండల కేంద్రము లోని శ్రీ కొదండా రామాలయంలో హనుమాన్ దేవాలయంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ మండిగ రేణుకా రాజనర్సయ్య ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని హనుమాన్ ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమములో ఆలయ పూజారి మురళి,భక్తులు,తదితరులు ఉన్నారు.

## సీబీఎస్ఈ సిలబస్ ను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- ఈ విద్యా సంవత్సరం నుండే 9వ తరగతి వరకు సీబీఎస్ఈ అమలు
- ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి నరేందర్ రెడ్డి



**సుల్తానాబాద్,మే 12(జనంసాక్షి) :** సుల్తానాబాద్ ఆల్ఫోర్స్ పాఠశాలకు సీబీఎస్ఈ సిలబస్ అనుమతి మంజూరు కావడం చాలా సంతోషంగా ఉందని, సీబీఎస్ఈ సెలబస్ ను సుల్తానాబాద్ మండల ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి నరేందర్ రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక ఆల్ ఫోర్స్ పాఠశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ 2026, 27 విద్యా సంవత్సరానికి గాను సీబీఎస్ఈ అనుమతి లభించిందని, ఈ విద్యా సంవత్సరం 9వ తరగతి వరకు అమలు చేస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం వరకు 10 వ,తరగతికి ప్రమోట్ చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో నూతన విద్యా విధానాన్ని తీసుకురావడానికి కృషి చేస్తున్న సందర్భంలో, ప్రభుత్వ పాఠశాలలో కూడా సీబీఎస్ఈ సిలబస్ అమలుకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. మా యొక్క ఆల్ఫోర్స్ విద్య సంస్థలైన కొత్తపల్లి, వర్దన్నపేటలలో సీబీఎస్ఈ సిలబస్ అనుమతి ఉందని ఇప్పుడు సుల్తానాబాద్ పాఠశాలకు అనుమతి లభించిందని, రానున్న రోజులలో అన్ని ఆల్ఫోర్స్ విద్యాసంస్థలలో సిబిఎస్ఈ సెలబస్ అమలు దిశగా చర్యలు చేపడతామన్నారు. సీబీఎస్ఈ సిలబస్కు సరిపడా విద్య ప్రమాణాలతో కూడిన సౌలభ్యం సుల్తానాబాద్ లో ఉందని, గతంలో దరఖాస్తు చేసినా, కొన్ని అనువార్య కారణాలవల్ల రద్దు అయిందని, తిరిగి ఇప్పుడు అనుమతి రావడంతో, మరింత బాధ్యత తో సిబ్బంది మేము పనిచేస్తామన్నారు. గత 14 సంవత్సరాలుగా సుల్తానాబాద్ లో ఆల్ఫోర్స్ పాఠశాలలో నాణ్యమైన విద్యా బోధన చేస్తూ, నీట్, ఐఐటి, ఎస్ఎస్సి లో వినూతన ఫలితాలను సాధిస్తున్నామన్నారు. సీబీఎస్ఈ అనుమతితో విద్యార్థిని విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెరుగుతుందని, తద్వారా పోటీ పరీక్షలలో విద్యార్థిని విద్యార్థులకు సులభతరంగా ఉంటుందని నరేందర్ రెడ్డి తన ఆశాభావాన్ని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన విధానాల మేరకు ఆల్ఫోర్స్ పాఠశాలలో నాణ్యమైన విద్యా బోధన చేస్తున్నామని, విద్యార్థిని విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే కాకుండా, మేధా శక్తిని పెంపొందించడం, క్రీడారంగాల్లో రాణించే విధంగా కృషి చేశామన్నారు. సుల్తానాబాద్ మండల విద్యార్థిని విద్యార్థులు సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అల్ఫోర్స్ విద్య సంస్థల అధినేత వి నరేందర్ రెడ్డి కోరారు. సీబీఎస్ఈ అనుమతి రావడానికి కృషి చేసిన ఆల్ఫోర్స్ విద్యాసంస్థల సిబ్బందికి నరేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా పూర్తి చేయించుకోవాలి

**కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ప్రభుత్వ పథకాల ప్రయోజనాలకు రైతు నమోదు అత్యవసరం**

**ఎరువులు, పంట రుణాలు, ధాన్యం విక్రయాలకు రైతు నమోదు సంఖ్య తప్పనిసరి**

**పెద్దపల్లి,మే 12(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లాలోని ప్రతి పట్టాదార్ పాసుబుక్ కలిగిన రైతు సోదరీ సోదరులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ (రైతు నమోదు) ప్రక్రియను పూర్తి చేయించు కోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.రైతులు తమ సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ఎ ఇ ఒ)ను సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను ఆన్లైన్‌లో పూర్తి చేయించుకోవాలని తెలిపారు. రైతు నమోదు పూర్తయిన అనంతరం ప్రతి రైతుకు ప్రత్యేకమైన రైతు నమోదు సంఖ్య ఆన్లైన్‌లో కేటాయించ బడుతుందని పేర్కొన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోని రైతులు భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పలు సంక్షేమ, వ్యవసాయ సంబంధిత పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కలెక్టర్ తెలిపారు.ఫార్మర్ రిజిస్ట్రీ సంఖ్య లేకుండా కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడం సాధ్యం కాదని, అలాగే పంటలకు అవసరమైన ఎరువుల కొనుగోలు, పంట రుణాల మంజూరు,



వరి, మొక్కజొన్న మరియు ఇతర ధాన్యాల విక్రయాల కోసం కూడా రైతు నమోదు సంఖ్య తప్పనిసరిగా అవసరమవుతుందని స్పష్టం చేశారు.అందువల్ల పెద్దపల్లి జిల్లాలోని అన్ని పట్టాదార్ పాసుబుక్ కలిగిన రైతులు తమ సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రీ అనే అతి ముఖ్యమైన ప్రక్రియను వెంటనే పూర్తి చేయించుకుని అన్ని రకాల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# పెద్దపల్లి నియోజకవర్గాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుతున్నాం

**- రూ. 6 కోట్లతో సబ్బితం గౌరి గుండాల జలపాతం అభివృద్ధి**

**- రూ. 43 లక్షలతో ప్లాస్టిక్ వ్యర్థాల మేనేజ్మెంట్ యూనిట్..**

**- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ చింతకుంట విజయరమణ రావు**

**పెద్దపల్లి,మే 12(జనంసాక్షి) :** పెద్దపల్లి మండలం సబితం గ్రామంలో రూ. 6 కోట్లతో గౌరి గుండాల జలపాతం అభివృద్ధి పనులకు ప్రభుత్వ అధికారులతో మరియు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేసి అనంతరం మండలంలోని గౌరెడ్డిపేట గ్రామంలో రూ. 43 లక్షలతో ప్లాస్టిక్ వ్యర్థాల మేనేజ్మెంట్ యూనిట్ నిర్మాణానికి



శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలోని పెద్దపల్లి జిల్లాలో ఉన్న ఒక ప్రముఖ పర్యాటక ప్రదేశం సబ్బితం జలపాతం అని ఇది పెద్దపల్లి మండలం, సబితం గ్రామం సమీపంలో గట్టు సింగారం కొండల నుండి ఉద్భవించి, వర్షాకాలంలో (జులై నుండి నవంబర్ వరకు) ఆకట్టుకునేలా ప్రవహిస్తుంది. పెద్దపల్లి నుండి 15 కి.మీ దూరంలో ఉన్న ఈ జలపాతం, స్థానికంగా "గౌరీ గుండాలుగా పిలవబడుతూ, దట్టమైన అటవీ ప్రాంతంలో సందర్శకులను ఆకర్షిస్తోదని రాష్ట ప్రభుత్వం రూ. 6 కోట్లతో జలపాతం అభివృద్ధి చేయడం జరుగుతుందని గత పాలకులు ఈ జలపాతాన్ని ఎన్ని సార్లు సందర్శించిన తట్టెడు మట్టికూడా తీసిన పాపాన పోలేదని కానీ ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత తాను శాసనసభ్యునిగా ఎన్నికైన తర్వాత రూ. 6 కోట్లు వెచ్చించి అభివృద్ధి పరుస్తున్నామని అవసరమైతే జలపాతం అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చూపిస్తామని తెలిపారు. సబితం జలపాతాలు వర్షాకాలంలో గట్టుసింగారం కొండల నుండి నీరు ఉప్పొంగి ప్రవహించడంతో జలపాతాలలాగా మారి అద్భుతమైన దృశ్యాన్ని ఆవిష్కరిస్తాయి. దీనిని సందర్శించడానికి చాలామంది పర్యాటకులు వస్తుంటారని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యాటకంగా ఆహ్లాదకరంగా తీర్చేందుకు జలపాతాన్ని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల మేనేజ్మెంట్ యూనిట్ ద్వారా ప్లాస్టిక్ రా మెటీరియల్ తయారీ అవుతుందని తెలిపారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి ప్రాసెసింగ్ చేసి ముడి సరుకులు తయారు చేసి టైల్స్, దారం వాటికి ఉపయోగిస్తారని తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వలన క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, ఈ యూనిట్ వలన పర్యావరణ కాలుష్యం తగ్గి పరిశుభ్రత పెరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ యూనిట్ మహిళా సంఘాల సభ్యుల ఆద్వర్యంలో పని చేస్తుందని, దీనికి గ్రామస్థులు అందరు సహకరించని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, తహసీల్దార్,పర్యాటక అధికారులు గ్రామ సర్పంచులు, కొమ్ము సుజాత,నూనె సరోజన-- రమేష్,మునిసిపల్ చెర్మన్ నుగుల్లా మల్లయ్య, మార్కెట్ చెర్మన్ కూర మల్ల రెడ్డి,పాలకవర్గం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై అఘాయిత్యం హేయమైన చర్య

**◆ కేంద్ర మంత్రి కుమారుడిని తక్షణమే అరెస్ట్ చేయాలి ◆ బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష**

**పెద్దపల్లి,మే 12(జనంసాక్షి) :** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ఒక 17 ఏళ్ల మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష తీవ్రంగా ధ్వజమెత్తారు.మంగళవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దాసరి ఉష మాట్లాడుతూ ఒక తండ్రిగా తన కుమారుడిని క్రమశిక్షణతో పెంచడంలో బండి సంజయ్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.గత కొన్ని నెలలుగా ఆ బాలికను వేధింపులకు గురిచేస్తున్నా, నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో కేసు నమోదు చేయడానికి పోలీసులకు మూడు రోజులు పట్టడం సిగ్గుచేటన్నారు.పోక్సో కేసు నమోదైనప్పటికీ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని,చట్టం ఎవరికైనా



ఒక్కటేనని ఆమె స్పష్టం చేశారు.బాధితురాలి తల్లిదండ్రులను పిలిపించి భయభ్రాంతులకు గురిచేస్తూ,కేసు వెనక్కి తీసుకోవాలని బండి సంజయ్ బెదిరింపులకు పాల్పడటం ఆయన అధికార గర్వానికి నిదర్శనమని ఉష ఆరోపించారు.నిందితుడిని కాపాడే ప్రయత్నం చేస్తున్న బండి సంజయ్‌ను కూడా ఈ కేసులో నిందితుడిగా చేర్చాలని, విచారణ నిష్పక్షపాతంగా జరగాలంటే ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో జోక్యం చేసుకుని,నేరస్తుడు ఎంతటి వారైనా వదలకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.బీజేపీ సే బేటీ బచావో అనే పరిస్థితి నేడు దేశంలో నెలకొందని,తెలంగాణ ఆడబిడ్డలకు రక్షణ కల్పించే వరకు తమ పోరాటం ఆగేది లేదని ఆమె హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ మహిళ కన్వీనర్ సిరవేణ స్వప్న,రామిళ్ళ శారద,, అరుణ,శారద,రాజమ్మ,వెులువూరి శేఖర్,అబ్దుల్ మాలిక్,భూమయ్య,తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లా (టిఎన్జీఓ) నూతన కార్యవర్గం ఎన్నిక

**- అధ్యక్షునిగా నాలుగో సారి బొంకూరి శంకర్ ఏకగ్రీవం- నాయకుడంటే ఆజ్ఞాపించేవాడు కాదు**

**పెద్దపల్లి,మే 12(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా టీఎన్జీఓ సంఘం ఎన్నికలు మంగళవారం పెద్దపల్లి సమూహ జిల్లా కార్యాలయాల సముదాయం(ఐడిఓసి), పెద్దపల్లి ప్రాంగణంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ కల్యాణ మండపంలో డి. శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా, రవి కుమార్, సహాయక ఎన్నికల అధికారిగా వ్యవహరించగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ప్రక్రియ మొదలుకొని నామినేషన్ల పరిశీలన అభ్యర్థుల ఎన్నిక అన్నీ ఆసక్తికరంగా సాగిన ఈ ఎన్నికల్లో పెద్దపల్లి జిల్లా టిఎన్జీఓ పెద్దపల్లి జిల్లా అధ్యక్షునిగా వరుసగా నాలుగవ సారి బొంకూరి శంకరన్న ఏకగ్రీవంగా ఎన్నికవగా,ఆయిరెడ్డి సందీప్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా, గోపు అనిత అసోసియేట్ అధ్యక్షులుగా, ఎడ్ల కొమురయ్య కోశాధికారిగా ఎన్నికవ్వగా, ఉపాధ్యక్షులుగా ఏ. శ్రీనివాస్, ఎస్. మహేందర్ రెడ్డి, వి.శ్రీనివాస్, కె. స్వప్న కుమారి, సంయుక్త కార్యదర్శులుగా ఈ. ప్రవీణ్, ఎమ్. శ్రీధర్, బి. రమేష్, పి. సౌమ్య, పబ్లిసిటీ కార్యదర్శిగా డి. నిశాంత్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి. అంజయ్య, ఈ సి మెంబర్లుగా శిల్ప, స్వప్న, శివధర్మతేజ, ముస్తఫా లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా చెల్లింపులు మరియు గణాంక అధికారి ప్రభాకర్ జిల్లా ఉపాధి కల్పన అధికారి రాజశేఖర్ పాల్గొని నూతనంగా ఎన్నుకైన నాయకులకు శుభాకాంక్షలు తెలిపి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బొంకూరి శంకర్ మాట్లాడుతూ నాలుగవ సారి వరుసగా ఏకగ్రీవంగా ఎన్నికవడం చాలా సంతోషంగా ఉందని, ఉద్యోగులు తన భాధ్యత మరింతగా పెంచిందని, జిల్లా ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని, నమ్మకంతో నన్ను ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి అండగా ఉండి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తాననీ. హామీ ఇచ్చారు. తదుపరి ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన సందీప్ రెడ్డి మాట్లాడుతూ కష్టపడి పని చేసే నాయకులకు మరియు యువ నాయకులకు అవకాశాలు ఇవ్వడం వలన వారు మరింత



భాద్యతగా పనిచేస్తారని, శంకరన్న నాయకత్వంలో జిల్లాలో ఏ కార్యక్రమం తలపెట్టినా అంకితభావంతో పనిచేస్తామని, ఈ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలుపుతూ, ఎల్లప్పుడూ ఉద్యోగాలు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి అర్బన్ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, పెద్దపల్లి రూరల్ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, కార్యదర్శి ప్రేమ్ సాగర్, కోశాధికారి రామచంద్రం, రామగుండం అధ్యక్షులు జగన్, సుల్తానాబాద్ అధ్యక్షులు భాగ్యమ్మ, కార్యదర్శి రాజిరెడ్డి, మంథని అధ్యక్షులు శంకర్, కార్యదర్శి పవన్ , కోశాధికారి అనిల్ రెడ్డి లతో పాటు వారి కార్యవర్గం మరియు జిల్లా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– టీఎన్జీవో అధ్యక్షుడిగా ఆయనకు ఆయనే సాటి : పెద్దపల్లి జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులుగా 2017 నుంచి నేటి వరకు నాలుగు సార్లు ఏకగ్రీవంగా జిల్లాలోని ఉద్యోగులు ఎన్నుకున్నారంటే, అందరివాడు అని పిలవడం ఆయన వ్యక్తిత్వాన్ని, కలుపుగోలు తత్వాన్ని సూచిస్తుంది. పెద్దపల్లి జిల్లాలో మొదటిసారి 2017 ఏప్రిల్ లో జరిగిన టీఎన్జీవో ఎన్నికల్లో జిల్లా టీఎన్జీవో అధ్యక్షులుగా బొంకూరు శంకర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన సారథ్యంలో ఉద్యోగుల సమస్యలపై నేటి వరకు రాజీలేని పోరాటం చేస్తున్నారు. ఫోర్త్ క్లాస్ ఉద్యోగి నుండి గెజిటెడ్ ఉద్యోగి వరకు ఎవరికి ఏ సమస్య వచ్చినా తానున్నానని భరోసా కల్పించడంలో ముందుంటారు. పదవి అనేది అధికారం కాదు అది ఒక బాధ్యతగా భావించే మనస్తత్వం ఉన్న వ్యక్తి బొంకూరు శంకర్. పిఆర్సి అమలు, ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు, ఉద్యోగ భద్రత, వంటి విషయాల్లో ఉద్యోగులకు వెన్నంటి ఉండే వ్యక్తి. ఆయన సేవ దృక్పథం, మానవత్వం, మంచితనం, ఆయన నైజం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ పరిధిలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ లో చైర్మన్గా ఉంటూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ముందుంటారు. శాఖ పరంగా ఇబ్బందుల్లో ఉన్న ఉద్యోగులకు, అండగా ఉంటూ, పై స్థాయి అధికారులను కిందిస్థాయి సిబ్బందిని సమన్వయపరచడంలో ఆయనకు ఆయనే చాటి.నాయకుడంటే ఆజ్ఞలు జారీ చేయడమే కాదు, అందరిని కలుపుకొని నడిచేవాడే నాయకుడని నమ్మే వ్యక్తి బొంకూరు శంకర్ నిజమని నిరూపించారు. జిల్లాలో టీఎన్జీవో సంఘం ఒక పటిష్టమైన బలమైన శక్తిగా ఎదగడంలో ఆయన వ్యూహాలు అద్భుతం. వాక్చాతుర్యం ఉద్యోగ సంఘ నాయకుడిగా సమన్వయకర్తగా ఉద్యోగుల సమస్యల పరిష్కరించడంలో ఆయన పోషించే పాత్ర ఆయనకు ఆయనే సాటి. జిల్లాస్థాయిలో పనిచేస్తూ రాష్ట్రస్థాయి నాయకత్వంతో సత్సంబంధాలు కలిగి ఉండడం ఆయన ప్రత్యేకత. ఉద్యోగులతో కలివిడిగా అందరివాడుగా ఉంటూ నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తున్న టీఎన్జీవో అధ్యక్షుని సేవలు ఉద్యోగులందరికీ మరింతగా ఆశదీపంగా నిలవాలని కోరుకుందాం అన్నారు.